క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనంతగిరి: వికారాబాద్ మండల పరిధి గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా కరెంట్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏడీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 3గంటల నుంచి 5 గంటల వరకు సిద్దులూర్, కొటాల గూడ, లాల్‌సింగ్‌తండా, చించల్‌పేట, పాతూర్, కామరెడ్డిగూడ ప్రాంతాల్లో సరఫరాను నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏడీ కోరారు.

ప్రధానోపాధ్యాయులకు ఈఎల్‌ఎస్ ఇవ్వాలి



ఎంపీడీఓ, ఎంఈఓలకు వినతిపత్రాలు అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ధారూరు: వేసవి సెలవుల్లో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులకు ఈఎల్ఎస్(సంపాదిత)సెలవులు మంజూరు చేయాలని పీఆర్‌టీయూ మండల నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఎంఈఓ బాబుసింగ్, ఎంపీడీఓ నర్సింహులుకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు చేయిస్తున్న ప్రధానోపాధ్యాయులకు ఈఎల్ఎస్ ఇవ్వాలన్నారు. పీఆర్‌టీయూ మండల నాయకులు మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, హీరామన్, సత్యం, మాణిక్యం, సుదర్శన్, వెంకటయ్య, అంజిలయ్య, మహేందర్, నర్సింలు, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపీటీసీల పెండింగ్ వేతనాలు చెల్లించండి

యాలాల: పెండింగ్‌లో ఉన్న ఎంపీటీసీల గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలని ఎంపీటీసీల సంఘం మండల ప్రధాన కార్యదర్శి, ముద్దాయిపేట ఎంపీటీసీ దేవగారి రాములు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే ఎంపీటీసీలపై చిన్నచూపు తగదన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎంపీటీసీలకు తగిన గుర్తింపునిచ్చి, గౌరవం ఇస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని కోరారు. ఈ విషయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టిసారించి వేతనాల విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ కేసులను పరిష్కరించండి

జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శిల్ప



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి

పరిగి: పెండింగ్ కేసులను పరిష్కరించాలని పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శిల్ప అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని న్యాయస్థానంలో నిర్వహించిన సమావేశంలో పోలీసు అధికారులతో ఆమె మాట్లాడారు. క్రైం రేటును తగ్గించేందుకు పోలీసులు కృషి చేస్తే, పెండింగ్ కేసుల పరిష్కారానికి మార్గం దొరుకుతుందని చెప్పారు. లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, పెండింగ్ కేసుల్లో ఇరు వర్గాలకు రాజీ కుదిర్చేందుకు కృషి చేయాలని పోలీసులకు సూచించారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కుల్కచర్ల: గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ఎంపీసీలో 37సీట్లు, బైపీసీలో 36సీట్లు అందుబాటులో ఉన్నాయని కళాశాల ప్రిన్సిపాల్ గంగరాంనాయక్ శనివారం తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన గిరిజన విద్యార్థులు ఇందుకు అర్హులని చెప్పారు. కార్పొరేట్ తరహాలో నాణ్యమైన విద్యా బోధన, తగిన సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు మండల పరిధి బండవెల్కిచర్ల గ్రామంలోని కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

మోడల్ స్కూల్‌లో..

మండల పరిధి ముజాహిద్‌పూర్ గ్రామంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదివేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, ఒకేషనల్ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నాయని, 10వ తరగతి పూర్తయి చేసి, ఆసక్తి ఉన్న విద్యార్థులు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

సూచిక బోర్డులు..

నందిగామ: మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహన దారులు కోరుతున్నారు. ఎలాంటి సూచికలు లేనందున ప్రమాదాల బారిన పడుతున్నామని తెలిపారు. చంద్రాయన్ గూడ నుంచి మామిడిపల్లికి వెళ్లే రోడ్డులో చాలా వరకు మలుపులు ఉన్నాయని, వెంటనే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

సర్కారు బడికి.. సరికొత్త సొబగులు

- ప్రత్యేక నిధులతో పాఠశాలల అభివృద్ధి
- అమ్మ ఆదర్శ కమిటీలతో మౌలిక సదుపాయాల కల్పన
- విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తి
- నూతనోత్తేజంగా సరస్వతీ నిలయాలు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల పిల్లలకు మెరుగైన సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా సర్కారు బడులను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతోంది. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలను కల్పనకు ఉపక్రమించింది. ప్రస్తుతం పాఠశాలల అభివృద్ధికి మహిళా సంఘాల ప్రతినిధులకు ప్రాధాన్యత కల్పిస్తూ సంఘం గ్రామ అధ్యక్షురాలిని పాఠశాలకు చైర్‌పర్సన్‌గా నియమించారు. కన్వీనర్‌గా ప్రధానోపాధ్యాయురాలు, మహిళా సంఘాల సీసీలు ఇన్‌చార్జిగా వ్యవహరించడంతో పాటు, అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తుంటారు.



చింతల్‌కుంటతండా పాఠశాల (ఇన్‌సెట్లో) పాఠశాలలో కొనసాగుతున్న పనులు



94 బడులు, రూ.2.40కోట్లు మంజూరు

ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. మండలంలోని 59 బడులకు గాను రూ.1కోటి 28లక్షలు, చౌడాపూర్ మండలంలోని 35 స్కూళ్లకుగాను రూ.1కోటి 12లక్షలు కేటాయించారు. పనుల నిర్వహణకు ముందస్తుగా కమిటీలకు మంజూరైన నిధులలో ఒక్కో పాఠశాలకు 25శాతం నిధులు చెల్లించి పనులు చేయిస్తున్నారు.

సౌకర్యాలకు ప్రాధాన్యత

సౌకర్యాల కల్పనలో భాగంగా పాఠశాలల్లో తాగు నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, భవనాల మరమ్మతులు తదితర వాటికి ప్రాధాన్యతనిస్తూ పనులు చేస్తున్నారు. ఇప్పటి వరకు 75శాతం పనులు పూర్తయినట్లు సమాచారం.

చిన్నారులకు ఉపయోగకరం



పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల వలన మా ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగం కానుంది. అన్ని సౌకర్యాలు ఉండి, ఆహ్లాదకరమైనా వాతావరణంలో ఉన్న పాఠశాలల్లో వారివారి పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు మక్కువ చూపే అవకాశం ఉంది.

– బాలమణి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్, అంతారం

సరికొత్తగా విద్యాసంవత్సరం



కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గామాల్లోని సర్కారు బడులను అంత్యంత ఆధునికంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో బడుల్లో వసతుల కల్పన పనులు వేగంగా కొనసాగుతున్నాయి. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి వందశాతం పనులను పూర్తిచేస్తాం. సరికొత్త సొబగులతో విద్యాసంవత్సరాన్ని ప్రారంభిస్తాం.

–రామకృష్ణ, ఎంపీడీఓ, కుల్కచర్ల

‘ఆదర్శ’ పనులను వేగవంతం చేయండి

మోమిన్‌పేట: అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు, మౌలిక వసతులను త్వరగా పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ యాదగిరి అన్నారు. శనివారం మండల కేంద్రం రైతు వేదికలో ప్రధానోపాధ్యాయులు, కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది, పాఠశాల కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామల్లోని ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి చేయాలన్నారు. కార్యదర్శులు పనులను పర్యవేక్షించాలని, పనుల్లో జాప్యం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. రేపటి నుంచి బడిబాట కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇందులో ఎంఈఓ గోపాల్, ఏఈపీఆర్‌డీ ప్రణీత్‌కుమార్, ఏపీఎం రాజు తదితరులు ఉన్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్త

మర్పల్లి: విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పట్లూర్ క్లస్టర్ ఏఈఓ ప్రశాంత్ రైతులకు సూచించారు. శనివారం మండల పరిధి ఘణాపూర్ గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అన్నదాతలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మాట్లాడారు. ఎరువులు, విత్తనాలను వ్యవసాయ శాఖ నుంచి గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణాల్లో కొనుగోలు చేయాలని చెప్పారు. కొనుగోలు అనంతరం డీలర్ సంతకంతో కూడిన రసీదును తీసుకోవాలన్నారు. పంటకాలం పూర్తయ్యే వరకు రసీదు, విత్తన ఖాళీ సంచిని దాచి ఉంచాలని పేర్కొన్నారు. లూజుగా విత్తనాలను కొనుగోలు చేయరాదన్నారు. తక్కువ ధరకే లభిస్తున్నాయని నాసిరకం ఖరీదు చేసి మోసపోవద్దని చెప్పారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ ప్రశాంత్

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ

ధారూరు: ఫర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు పోలీసుల సహకారంతో తనిఖీలు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఝాన్సీలక్ష్మి, ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్, సిబ్బందితో కలిసి శనివారం సంయుక్తంగా పెస్టిసైడ్స్, సీడ్స్ దుకాణాల్లో సోదాలు నిర్వహించారు. రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తే కేసులు నమోదు చేసి, షాపు లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు. దుకాణాల్లోని స్టాక్ వివరాలను రోజు వారీగా బోర్డుపై ప్రదర్శించాలని దుకాణదారులకు సూచించారు. విత్తనాలు, ఎరువుల క్రయవిక్రయాల్లో రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని, విత్తనాలు కొనుగోలు చేసిన వెంటనే వారికి రసీదు ఇవ్వాలని చెప్పారు.



ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ, ఎస్‌ఐలు

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

బంట్వారం: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు అన్నారు. శనివారం కోట్‌పల్లి మండల కేంద్రంలోని నల్లపోచమ్మ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవంలో నందు పాల్గొన్నారు. పార్టీ చేవేళ్ల పార్లమెంటు అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు విశ్వజిత్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకొని సన్మార్గంలో నడవాలని సూచించారు. కులమతాలకు అతీతంగా సోదరభావంతో మెలగాలని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు కృష్ణా యాదవ్, ధారురు పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో నందు తదితరులు

దశాబ్ది ఉత్సవాలకు సర్వం సిద్ధం



మర్పల్లి: ఉత్సావాలకు ముస్తాబైన తహసీల్దార్ కార్యాలయం

- ముస్తాబైన ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు

కొడంగల్/మర్పల్లి/బొంరాస్‌పేట/తాండూరు రూరల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, రాజకీయ పార్టీల కార్యాలయాలు ముస్తాబయ్యాయి. రంగురంగుల కాగితాల తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉత్సవాలను రాజకీయాలకు అతీతంగా జరుపుకోవాలని, వేడుకలకు సకల జనులు ఆహ్వానితులేనని అధికారులు, నాయకులు, ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఉదయం 8.45 గంటలకు ఆయా కార్యాలయాలపై జాతీయ జెండాలను ఎగరవేయనున్నట్లు స్పష్టం చేస్తున్నారు.

ఎక్కడెక్కడ..

బొంరాస్‌పేటలో.. రాష్ట్ర అవతరణ వేడుకలను ఆదివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకన్‌గౌడ్ తెలపగా.. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల స్థాయిలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలు గౌడ్ పేర్కొన్నారు. కొడంగల్‌లో.. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో దశాబ్ది సంబురాలను వైభవంగా నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. అదే విధంగా పట్టణంలోని మున్సిపల్, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయంతో పాటు పోలీస్‌స్టేషన్లో జాతీయ జెండాను ఎగురవేయనున్నట్లు అధికారులు తెలిపారు. తాండూరులో.. మండల పరిధి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కలగానే కళాశాల!



మొయినాబాద్ నుంచి ప్రైవేటు కళాశాలలకు వెళ్తున్న విద్యార్థులు(ఫైల్)

- మొయినాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేక ఇబ్బందులు
- ఏళ్లు గడుస్తున్నా అమలుకు నోచని పాలకుల హామీ
- ఉన్నత విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థులు

మొయినాబాద్: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలింది. కళాశాల అందుబాటులో లేక పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. నగర శివారు ప్రాంతం కావడంతో చేవెళ్ల నియోజకవర్గంలో అనేక పెద్ద పెద్ద ప్రైవేట్ కళాశాలలు ఉన్నా.. అందులో విద్యను అభ్యసించే స్తోమత లేకపోవడంతో 10వ తరగతి పూర్తి చేసిన ప్రతిభ గల పేద విద్యార్థులు మధ్యలోనే చదువును ఆపేస్తున్నారు. ఎన్నో ఏళ్లగా మండల ప్రజలు ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం ఎదురుచూస్తున్నా.. అది కలగానే మిగిలిపోతోంది. ఎన్నికల సమయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుపై హామీలు ఇస్తున్నా.. నేటికీ ఆ మాటలు నీటి మూటలుగానే మిగిలుతున్నాయి. దీంతో మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కలగానే మిగులుతోంది. మొయినాబాద్ మండలంలో 14 జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రతి సంవత్సరం సుమారు 700 మంది విద్యార్థులు పదో తరగతి పూర్తి చేస్తున్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఇంటర్ చేయాలంటే మాత్రం ప్రైవేట్ కళాశాలలకే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదు. దీంతో చాలామంది మండలంలోని ప్రైవేట్ కళాశాలలతో పాటు చేవెళ్ల, బండ్లగూడ, మెహదీపట్నం లోని ప్రైవేట్ కళాశాలలకు వెళ్తున్నారు. ఈ ఏడాది సైతం మండలంలో సుమారు 550 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి పాసయ్యారు. వారంతా ఇంటర్ చదువుల కోసం ప్రైవేట్ కళాశాలలకే వెళ్లాల్సి వస్తుంది.

అందుబాటులో లేక..

మండల పరిధి ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు అందుబాటులో లేవు. చేవెళ్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్నా.. ఆ మండలంలోని విద్యార్థులకే అందులో పూర్తిస్థాయిలో సీట్లు దొరకడం లేదు. ఇక మొయినాబాద్ మండలంలోని విద్యార్థులకు అక్కడి కళాశాలలో సీట్లు దొరకడం గగనమే. దీంతో చాలా మంది విద్యార్థులు ప్రైవేటు కళాశాలలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇది పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఆర్థిక భారంగా మారుతోంది. ప్రైవేటు కళాశాలల్లో ఫీజులు కట్టలేని స్థితిలో ఉన్న కొంతమంది తల్లిదండ్రులు 10వ తరగతితోనే తమ పిల్లల చదువులను మాన్పించేస్తున్నారు.

నెరవేరని నేతల హామీలు..

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ఇరవై ఏళ్లుగా ప్రతి ఎన్నికల్లోనూ అన్ని పార్టీల నేతలు హామీలు ఇస్తూ వస్తున్నారు. ఎన్నికల్లో గెలిచాక ప్రజాప్రతినిధులు ఆ విషయాన్నే మర్చిపోతున్నారు. దీంతో రెండు దశాబ్దాలుగా మండల ప్రజలు ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. విద్యార్థి సంఘాలు సైతం ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అయినా ఫలితం శూన్యం. కొత్త ప్రభుత్వమైనా కళాశాల ఏర్పాటుపై దృష్టి సారించి, సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు కోరుతున్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

కొడంగల్: పట్టణ శివారులో సిద్దులు తపస్సు చేసిన సిద్దగొంపు ఆంజనేయ స్వామి ఆలయంలో హిందూ వాహిని సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. 36 వారాలుగా ప్రతి శనివారం పారాయణం చేస్తున్నారు. చివరి వారం విజయవంతంగా పూర్తి చేసినట్లు సభ్యులు తెలిపారు. సామూహిక చాలీసా పారాయణంలో హిందూ వాహిని జిల్లా కార్యదర్శి రాకేశ్‌కుమార్, సర్వేష్, భాను ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

రైలును పునరుద్ధరించండి

తాండూరు టౌన్: కరోనా సమయంలో రద్దయిన గుల్బర్గా–హైదరాబాద్ ప్యాసింజర్ రైలును పునరుద్ధరించాలని కోరుతూ సామాజిక కార్యకర్తలు ఎండీ ముస్తఫా రిజ్వాన్, విజేందర్‌లు శనివారం సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. తాండూరు నుంచి ఉదయం పూట హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఒకే ప్యాసింజర్ రైలు నడుస్తోందని, తర్వాత ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెళ్లడం వలన సాధారణ బోగీల్లో ప్రయాణించ లేక ప్రజలు రైలు ప్రయాణానికి ఆసక్తి చూపడం లేదని పేర్కొన్నారు. ప్రజల అవసరాన్ని గుర్తించి, గతంలో లాగే గుల్బర్గా–హైదరాబాద్ ప్యాసింజర్ రైలును పునరుద్ధరించాలని కోరారు.

ఘనంగా హనుమాన్ జయంతి

కొడంగల్: హనుమాన్ జయంతి సందర్భంగా పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఘనంగా పూజలు జరిగాయి. తితిదే తరహాలో పూజలు నిర్వహించారు. శ్రీ వరహస్వామి ఆలయ ఆవరణలోని వీరాంజనేయ స్వామివారికి పాలు, పెరుగు, తేనే, నెయ్యి పసుపు చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం అర్చన చేపట్టారు. స్వామివారికి ఇష్టమైన వడ ప్రసాదం నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మండల పరిధి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాంరెడ్డిపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులు ఘనంగా పూజలు చేశారు.



కొడంగల్: విశేష అలంకరణలో స్వామివారు



కుల్కచర్ల: హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పంట మార్పిడి.. మంచి దిగుబడి

- పెరగనున్న భూసారం
- చీడపీడల వృద్ధికి అడ్డుకట్ట
- అధిక ఆదాయం పొందనున్న అన్నదాత



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

పరిగి: ‘దీర్ఘ కాలంగా ఒకేరకమైన పంట సాగు చేయడం వలన పోషకాలు తగ్గుతాయి. మొక్కల ఎదుగుదల ఉండదు. తెగుళ్లు సోకే అవకాశం ఉంది. అందుకే పంటమార్పిడి చేయాలి’ అని వ్యవసాయ నిపుణులు, అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఒకే రకమైన పంట సాగుతో దిగుబడి తగ్గుముఖం పట్టి, రైతులు నష్టపోతున్నారని వెల్లడిస్తున్నారు. పంట మార్పిడితో అధిక దిగుబడి పొంది, లబ్ధి పొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంటున్నారు. సాగులో పంట విస్తరణ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని రైతులకు సూచిస్తున్నారు. ఇందులో భాగంగానే ఏఓ, ఏఈఓలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. రైతులకు పంట మార్పిడి, సాగులో మెలకువలు ఇస్తున్నారు. ఎరువులు, విత్తన కొనుగోలు విషయాలపై తగిన జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు.

మార్పిడి ప్రాధాన్యత

ఒక పంటను ఒకే పొలంలో ఎక్కువసార్లు వేయడం వలన చీడపీడల ఉధృతి పెరిగేందుకు అవకాశాలు ఉన్నాయి. పురుగు జీవితచక్రం నిరాటంకంగా ముగించుకుని తీవ్రమైన హానీ కలిగిస్తుంది. పంట మార్పిడి చేసినప్పుడు పురుగు జీవితచక్రం ఛేదించబడుతుంది. ఇలా ఎందుకంటే ఒక పంటపై ఆశించే పురుగు మరో పంటపై ఆశించడం సాధారణంగా జరగదు. వేగంగా వృద్ధి చెందే కొన్ని రకాల పురుగులను పంటమార్పిడి వలన అదుపులో పెట్టవచ్చు. ఒకే లోతు వ్యవస్థ కలిగిన పంటలు ఉదాహరణకు పత్తి, మిరప, మొదలైన వాణిజ్య పంటలను మార్పిడి చేయకుండా సాగు చేయడం వలన ఒకే లోతు పొరల నుంచి పోషకాలు తీసుకోవడంతో నేల నిస్సారమవుతుంది. వరి, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, వంటి పైర్లు నేలపై పొరల నుంచి పోషకాలను తీసుకుంటాయి. నేల భౌతిక లక్షణాల స్వభావం దెబ్బతినకుండా ఉండానికి చీడపీడల వృద్ధిని నిరోధించడానికి పంటమార్పిడి తప్పనిసరి. అప్పుడప్పుడు అవసరాన్ని బట్టి పశుగ్రాసం కోసం గడ్డిజాతి పైర్లు భూసారాన్ని పెంచడానికి పచ్చిరొట్టను సాగు చేయాలి.

లాభాలు

వరి తర్వాత మినుము, పెసర, శనగ, వేయడం వలన సుడిదోమ, టుంగ్రో వైరస్‌ను నివారించవచ్చు. పత్తి వేసిన పొలంలో మొక్కజొన్న, జొన్న నువ్వులు, మినుములు వేస్తే లద్దె పురుగు, పచ్చపురుగుల బెడద ఉండదు. జొన్న, మొక్కజొన్న తర్వాత కంది సాగు చేస్తే కాయతొలుచు పురుగు ఉధృతి తగ్గుతుంది. వరి పొలాల్లో ముందుగా పప్పుధాన్యాలను సాగు చేయడం వలన నేల సారవంతమవుతుంది. వేరుశనగలో ఆకు ముడతను నివారించేందుకు పప్పుజాతికి చెందిన పైర్లతో మార్పిడి చేయాలి. కంది, మిరప పంటల్లో ఎండుతెగులు నివారణకు జొన్న, మొక్కజొన్న పంటలతో మార్పిడి చేయాలి. నులి పురుగు సమస్య అధికంగా ఉన్న ప్రాంతాల్లో వెరుశనగ, మిరప వంటి పైర్ల సాగును కొన్ని పంట కాలాల వరకు ఆపాలి. ఆహార పంటలైన వరి, జొన్న, మొక్కజొన్న, సజ్జ పైర్లను పప్పుజాతి పైర్లయిన పెసర, మినుము, వేరుశనగతో మార్పిడి చేయాలి. ఆహార వాణిజ్య పంటలను పశుగ్రాస పైర్లతో ఒకసారి, పప్పుజాతి పైర్లతో మరోసారి మార్పిడి చేయడం వలన రైతులు లబ్ధి పొందుతారని అధికారులు స్పష్టంచేస్తున్నారు.

మార్పు మంచిదే..



రైతులు ఒకే పంటను మళ్లీమళ్లీ సాగు చేయరాదు. అలా చేయడం వలన ఆ పంట మొక్కలకు అవసరమైన పోషకాలు తక్కువై దిగుబడులు తగ్గిపోతాయి. అంతే కాకుండా రోగకారక పురుగుల జీవితచక్రం ముగించుకుని రోగాల ఉధృతి పెరుగుతుంది. అందుకే వరుసగా ఒకే రకమైన పంటలు సాగు చేయొద్దు. పంట మార్పుతోనే అన్నదాతలకు లబ్ధి.

– ప్రభాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, పరిగి